క్లుప్తంగా

ట్రస్మా అధ్యక్షుడిగా రాజిరెడ్డి



బాన్సువాడ: బాన్సువాడలోని ప్రైవేటు పాఠశాలల(ట్రస్మా) యజమానుల సంఘం అధ్యక్షుడిగా పాశం రాజిరెడ్డిని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ట్రస్మా సర్వసభ్య సమావేశం ఏర్పాటు చేసి నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా సాయిలు, ప్రధాన కార్యదర్శిగా షేక్ లడ్డు, సహాయ కార్యదర్శిగా శ్యాంగౌడ్, గౌరవ సలహాదారులుగా దాసరి మహేందర్, పంతులు నరేష్‌లను ఎన్నుకున్నారు. ప్రైవేటు పాఠశాలల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని రాజిరెడ్డి అన్నారు.

ఎల్‌వోసీ అందజేత



మాచారెడ్డి: మండలంలోని లచ్చపేట గ్రామానికి చెందిన చల్ల జ్యోతి అనారోగ్యానికి గురైంది. ఆపరేషన్ నిమిత్తం అత్యవసరంగా రూ.3 లక్షలు అవసరం కావడంతో కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి ఎల్‌వోసీ ఇప్పించారు. ఎల్‌వోసీ కాపీని బీజేపీ మండల అధ్యక్షుడు బూస సురేష్, గ్రామ అధ్యక్షుడు చల్ల ఎల్లం, సభ్యులు చల్ల లక్ష్మీనారాయణ, భరత్ యాదవ్‌లు బాధితులకు అందజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాటిపల్లికి కృతజ్ఞతలు తెలిపారు.

వాహనాలకు నంబర్ ప్లేట్లు తప్పనిసరి



బీబీపేట: వాహనదారులు తప్పనిసరిగా నంబర్ ప్లేట్‌లను ధరించాలని లేకుంటే చర్యలు తప్పవని ఎస్సై ప్రభాకర్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని ప్రధాన రహదారిపై వాహనాల తనిఖీ చేపట్టారు. ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్‌లు తప్పనిసరిగా ఉండాలని, ధ్రువపత్రాలు సైతం ఉండాలని తెలిపారు. హెల్మెట్ లేని వాహనదారులకు జరిమానా విధించారు. ఆయన వెంట పోలీసు సిబ్బంది ఏఎస్సై ప్రభాకర్, హెడ్‌కానిస్టేబుల్ సాయిబాబా, సిబ్బంది ఉన్నారు.

కళ్లద్దాల పంపిణీ



మాచారెడ్డి: మండలంలోని అక్కాపూర్ గ్రామానికి చెందిన ముత్యాల లక్ష్మీనరసింహారెడ్డి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ నరసింహారెడ్డి ఆదివారం ఇటీవల నిర్వహించిన నేత్ర వైద్య శిబిరంలో కంటి లోపాలు ఉన్న వంద మందికి కళ్లద్దాలను అందజేశారు. గతంలో కూడా ఎన్నో సేవా కార్యక్రమాలు చేసి అందరి మన్ననలు పొందారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు బెంజారం నవీన్ రెడ్డి, రాజిరెడ్డి, సన్నీ పద్మా రెడ్డి, మాజీ సర్పంచ్ పగడాల బాలచంద్రం, గడ్డం బాబు, మాజీ ఉపసర్పంచ్ మోత్కు ఎల్లయ్య, గ్రామస్తులున్నారు.

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ



నిజాంసాగర్(జుక్కల్): జుక్కల్ మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ఆవరణలో ఆదివారం ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు చేతుల మీదుగా కల్యాణ లక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. ఆడపిల్లల పెళ్లిళ్లు చేస్తున్న తల్లులకు కల్యాణ లక్ష్మి పథకం వరంలా మారిందని ఎమ్మెల్యే అన్నారు. ఆయా మండలాలకు చెందిన వారికి చెక్కులను అందజేశారు. తహసీల్దార్లు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

వన మహోత్సవం



కామారెడ్డి అర్బన్: జిల్లా కేంద్రంలో స్థానిక యోగా భవన్ వద్ద యోగా స్పోర్ట్స్ అసోసియేషన్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఆదివారం వన మహోత్సవం నిర్వహించారు. యోగా ప్రతినిధులు, సభ్యులు తమ తమ తల్లితండ్రుల పేరిట ఒక్కో మొక్క నాటారు. కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు జి.రాంరెడ్డి, ప్రతినిధులు బి.రఘుకుమార్, పి.అంజయ్య, సిద్ధాగౌడ్, ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

నత్తనడకన బ్రిడ్జి నిర్మాణ పనులు

- భారీ వర్షాలు పడితే సర్వీస్ రోడ్డు బంద్ అయ్యే అవకాశం
- ఈ కారణంగా కామారెడ్డికి వెళ్లడానికి వాహనదారులకు ఇబ్బందులు
- బ్రిడ్జి త్వరగా పూర్తి చేయాలని స్థానికుల విన్నపం



రామారెడ్డిలో గంగమ్మ వాగుపై నిర్మిస్తున్న వంతెన

రామారెడ్డి: రామారెడ్డిలోని గంగమ్మ వాగుపై నూతన వంతెన నిర్మాణానికి గత ఏడాది రూ.3 కోట్ల నిధులు విడుదల చేశారు. గర్గుల్ వంతెనకు రూ.2 కోట్ల 90 లక్షల నిధులు మంజూరయ్యాయి. గర్గుల్ వంతెన నిర్మాణ పనులు పూర్తయ్యాయి. కానీ రామారెడ్డిలోని గంగమ్మ వాగు వంతెన పనులు మాత్రం నత్తనడకన కొనసాగుతూ ఉన్నాయి. వర్షాలు కురిస్తే ఈ దారి వెంట కామారెడ్డికి వెళ్లే వాహనదారులు చాలా ఇబ్బందులు పడాల్సి వస్తుంది. వర్షాలకు రోడ్డు పూర్తిగా బంద్ అయ్యే అవకాశం ఉంది. ప్రస్తుతం గంగమ్మ వాగు బ్రిడ్జి నిర్మాణంలో ఉండడంతో వాగులో నుంచి సర్వీస్ రోడ్డు వెంట ప్రయాణాలు కొనసాగుతున్నాయి. వర్షాలు పడితే సర్వీస్ రోడ్డు వెంట నీటి ప్రవాహం ఉంటుంది. పూర్తిగా రోడ్డు బంద్ అవుతుంది. రామారెడ్డి గంగమ్మ వాగు బ్రిడ్జి నిర్మాణ పనులు వర్షాలు కురిసేలోపు పూర్తి కాకపోతే కన్నాపూర్ మీదుగా వెళ్లాల్సి ఉంటుంది.. అక్కడ వాగు అడ్డుపడుతుండడం, పోసానిపేట- వడ్లూరు మీదుగా వెళ్లినా..ఇదే పరిస్థితి. సదాశివనగర్ మండలం మీదుగా కామారెడ్డి వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. పనులు ప్రారంభమై నెలలు కావస్తున్నా వంతెన పనుల్లో వేగం పుంజుకోవడం లేదు. నిర్మాణంలో ఇంకా జాప్యం జరిగితే ఈ రోడ్డు వెంట వెళ్లే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోక తప్పదు. బ్రిడ్జి నిర్మాణ పనుల జాప్యంపై ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదనమోహన్‌రావును కలిసి కాంగ్రెస్ నాయకులు ఫిర్యాదు చేశారు. ఎమ్మెల్యే సైతం అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేసినట్లు నాయకులు చెబుతున్నారు. అధికార యంత్రాంగం స్పందించి భారీ వర్షాలు పడేలోపే బ్రిడ్జి నిర్మాణ పనులను పూర్తి చేసి ఈ రోడ్డు వెంట వెళ్లే వారికి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని కోరుతున్నారు.

బకాయి డబ్బులడిగినందుకే తప్పుడు ఫిర్యాదులు



జంగంపల్లిలో మాట్లాడుతున్న వీడీసీ ప్రతినిధులు

భిక్కనూరు: గ్రామాభివృద్ధి కమిటీ బకాయి ఉన్న డబ్బులను అడిగినందుకే బకాయిదారులు వీడీసీపై తప్పుడు ఫిర్యాదులు చేస్తున్నారని జంగంపల్లి గ్రామాభివృద్ధి కమిటీ అధ్యక్షుడు పుల్లూరి శివలింగం ఆరోపించారు. ఆదివారం ఆయన జంగంపల్లిలో మాట్లాడారు. తాము ఇప్పటి వరకు వీడీసీ తరపున చేపట్టిన అభివృద్ధి పనులు, ఆదాయ వ్యయాల గురించి వీడీసీ డైరెక్టర్లందరికి లిఖిత పూర్వకంగా తెలిపామన్నారు. అన్ని కుల సంఘాల నేతలకు కూడా లెక్కల పత్రాలను అందించామన్నారు. ఎంపీడీవోకు ఎక్సైజ్ అధికారులకు తప్పుడు ఫిర్యాదులు చేసిన నేతలు వారు బకాయి ఉన్న డబ్బులను వీడీసీకి చెల్లించాలని ఒత్తిడి తేవడంతో తప్పుడు ఫిర్యాదులు, ఆరోపణలు చేస్తున్నారన్నారు. ఇకనైనా బకాయిలు చెల్లించి తప్పుడు ఫిర్యాదులను వెనక్కి తీసుకోవాలన్నారు. వీడీసీ ఉపాధ్యక్షుడు రాములు, ప్రధాన కార్యదర్శి కుర్రి బాల్‌కిషన్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో పందుల స్వైర విహారం



తాడ్వాయి: మొక్కజొన్న పంటలో ఊర పంది

తాడ్వాయి(ఎల్లారెడ్డి): మండల కేంద్రంతో పాటు దేమికలాన్, క్రిష్ణాజివాడి తదితర గ్రామాలలో ఊర పందులు స్వైర్య విహారం చేయడంతో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. ఇళ్ల పరిసరాలలో తిరుగుతూ ఇంటి ముందర ఉన్న సామగ్రిని చిందర వందరగా చేస్తున్నాయని స్థానికులు వాపోతున్నారు. అధికారులకు ఎన్ని సార్లు చెప్పినా పట్టించుకోవడం లేదని చెబుతున్నారు. వర్షాకాలంలో పందులు తిరగడంతో ప్రజలకు రోగాలు వచ్చే అవకాశముందంటున్నారు. పంట చేలలో తిరుగుతూ సోయా, మొక్కజొన్న, పత్తిపంట మొక్కలను పాడు చేస్తున్నాయని వాపోతున్నారు. అధికారులు, పెంపకందారులతో మాట్లాడి వాటిని కట్టడి చేయాలని కోరుతున్నారు.

సమయానికి అందని అల్పాహారం



ఉదయం 11 గంటలకు అల్పాహారం కోసం బారులు తీరిన విద్యార్థినులు

- మధ్యాహ్న భోజనం సైతం నాణ్యతగా లేదని విద్యార్థినుల ఆవేదన
- చర్యలు తీసుకోవాలని కోరుతున్న విద్యార్థినుల తల్లిదండ్రులు

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): నాగిరెడ్డిపేట కస్తూర్బా పాఠశాలలో విద్యార్థినులకు సమయానికి అల్పాహారం అందకపోవడంతో వారు ఇబ్బందులకు గురైన ఘటన ఆదివారం చోటుచేసుకుంది. ఉదయం 9 గంటలలోపు అందించాల్సి ఉండగా 11 గంటలు దాటినా వారికి అల్పాహారం అందించలేదు. ప్రతి ఆదివారం తమ పిల్లలను చూడటానికి పాఠశాలకు తల్లిదండ్రులు వస్తుంటారు. 11 గంటల తర్వాత బ్రేక్ ఫాస్ట్ పెట్టడం వారు గమనించారు. ప్రతి ఆదివారం ఇలాగే ఉంటుందని వారు పేర్కొనడంతో విద్యార్థినుల తల్లిదండ్రులు పాఠశాలలోని సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న విలేకరులు పాఠశాలకు వెళ్లగా విద్యార్థినులు వారి కష్టాలను ఏకరువు పెట్టారు. ప్రతి ఆదివారం ఉదయం 11 గంటలకు అల్పాహారం అందిస్తున్నారని, మధ్యాహ్న భోజనం సైతం నాణ్యతగా ఉండడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. తమ పిల్లలకు సమయానికి భోజనం అందేలా ఉన్నతాధికారులు చర్యలు చేపట్టాలని విద్యార్థినుల తల్లిదండ్రులు డిమాండ్ చేస్తున్నారు.

భజన కీర్తనలు



సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండలంలోని కుప్రియాల్‌లోని సత్యానంద భజన మండలి సభ్యులు శనివారం తిరుపతిలో భజన కీర్తనలు ఆలపించారు. అఖండ హరినామ సంకీర్తన కార్యక్రమంలో భాగంగా రెండు రోజుల పాటు భజన కీర్తనలు ఆలపిస్తున్నట్లు ఆర్గనైజర్ రాజిరెడ్డి తెలిపారు.

ముగిసిన మోడల్ ప్రవేశ పరీక్ష

సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలో ఆదివారం నిర్వహించిన మోడల్ స్కూల్ ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా ముగిసినట్లు ప్రిన్సిపాల్ భానుమతి తెలిపారు. 6వ తరగతిలో వంద సీట్లకు గాను 536 మంది విద్యార్థులు దరఖాస్తులు చేసుకోగా 490 మంది పరీక్షలు రాసినట్లు తెలిపారు. పరీక్ష కేంద్రాన్ని డీఈవో రాజు తనిఖీ చేశారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి 4 గంటల వరకు 7-10వ తరగతుల్లో ప్రవేశం కోసం 528 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా 464 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరైనట్లు తెలిపారు.

సమాచారం..

నేడు తాడ్వాయిలో ప్రజావాణి

తాడ్వాయి(ఎల్లారెడ్డి): స్థానిక తహసీల్ కార్యాలయంలో సోమవారం ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ రహీమొద్దీన్ తెలిపారు. ఈ ప్రజావాణి ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు కొనసాగుతుందని, ఈ కార్యక్రమానికి అన్ని శాఖల అధికారులు హాజరవుతారన్నారు. గ్రామాలలో ఏమైనా సమస్యలు ఉన్నట్లయితే ఈ ప్రజావాణిలో ఫిర్యాదులు చేసుకోవాలని సూచించారు.

రేపు ఆర్‌ఎస్‌ఎస్ గురుపూజ కార్యక్రమం

కామారెడ్డి అర్బన్: రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్‌ఎస్‌ఎస్) కామారెడ్డి నగర శ్రీగురు పూజా కార్యక్రమం ఈనెల 9న మంగళవారం ఉదయం 7 గంటలకు స్థానిక కళాభారతి స్టేడియంలో నిర్వహించనున్నట్లు నగర సంఘచాలక్ కొమిరెడ్డి స్వామి తెలిపారు. కార్యక్రమంలో పాల్గొనే వారు నిర్ణీత సమయానికి 10 నిమిషాల ముందుగా చేరుకోవాలని కోరారు.

అల్లుకున్న నిర్లక్ష్యం



బాన్సువాడ రూరల్ : జీపీ పాలకుల నిర్లక్ష్యం, ట్రాన్స్‌కో అధికారుల అలసత్వానికి నిలువెత్తు నిదర్శనంగా నిలుస్తోంది ఈ విద్యుత్ స్తంభం. దేశాయిపేట్ గ్రామంలో రోడ్డు పక్కనే ఈ విద్యుత్ స్తంభం ఉంది. స్తంభం చుట్టూ పైవరకు అల్లుకున్న తీగలతో మనుషులకు, పశువులకు ప్రమాదం పొంచి ఉంది. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

బోనాల పండుగ



బాన్సువాడ: ఆషాఢ మాసం పురస్కరించుకుని ఆదివారం బాన్సువాడలో ముత్యాల పోశమ్మ బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. పాత బాన్సువాడ నుంచి మహిళలు బోనాలతో శోభాయాత్ర నిర్వహించారు. కొత్త బాన్సువాడలో ఉన్న ముత్యాల పోశమ్మకు బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

ఊర పండుగ ఉత్సవాలు



నిజాంసాగర్(జుక్కల్): మహమ్మద్‌నగర్ మండలంలోని సింగితంలో ఊర పండుగ ఉత్సవాలు నిర్వహించారు. గ్రామంలోని 16 దేవతలను పూజించి మొక్కులు చెల్లించుకున్నారు. సాయంత్రం వేళ దుర్గమ్మ తల్లి, ముత్యాల పోచమ్మ అమ్మ వారికి బోనాల ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు ర్యాల లావణ్య, శ్రీధర్‌రెడ్డి, శంకర్‌రెడ్డి, తదితరులు ఉన్నారు.

పార్లమెంట్‌లో ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టాలి



ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టాలని నినాదాలు చేస్తున్న ఎమ్మార్పీఎస్ ప్రతినిధులు



ఎల్లారెడ్డిలో జెండాను ఎగురవేస్తున్న నాయకులు

కామారెడ్డి అర్బన్: ఎమ్మార్పీఎస్ 30వ వార్షికోత్సవం సందర్భంగా ఆదివారం స్థానిక జిల్లా కార్యాలయం వద్ద ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు చిట్యాల సాయన్న జెండా ఎగురవేశారు. ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టాలని డిమాండ్ చేస్తూ నినాదాలు చేశారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మభ్యపెడుతోందని ఆరోపించారు. ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆర్.బాగయ్య, జిల్లా ప్రతినిధులు కే.ఈశ్వర్, కే.అశోక్, నవాబ్ మహేష్, పోచయ్య, రామచంద్రం, తదితరులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిలో..

ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డిలో ఎంఆర్‌పీఎస్ ఆవిర్భావ వేడుకలను ఆదివారం నిర్వహించారు. పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో ఎంఆర్‌పీఎస్ నాయకులు పార్టీ జెండాను ఎగురవేశారు.



కాటేపల్లిలో రేణుకా ఎల్లమ్మ దేవతకు పూజలు చేస్తున్న మాదిగ నేతలు

పెద్దకొడప్‌గల్(జుక్కల్): కాటేపల్లిలో ఎమ్మార్పీస్ ఆవిర్భావ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాదిగ నేతలు దండోరా జెండాలు పట్టుకుని గ్రామంలోని లంద వద్ద రేణుక ఎల్లమ్మ దేవతకు ప్రత్యేక పూజలు చేశారు. తదనంతరం మండల అధ్యక్షుడు సర్వగల్ల రవీందర్ మాట్లాడారు. నేత సాయిలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలతో అప్రమత్తంగా ఉండాలి



లింగంపేట: అవగాహన కల్పిస్తున్న ఏఎస్సై రంగారావు



సదాశివనగర్‌లో .. ఏఎస్సై సాగర్

లింగంపేట(ఎల్లారెడ్డి):ప్రజలు సైబర్ నేరాలతో అప్రమత్తంగా ఉండాలని ఏఎస్సై రంగారావు సూచించారు. ఆదివారం ఆయన లింగంపేట మండల కేంద్రంలో పలువురికి సైబర్ నేరాల పట్ల అవగాహన కల్పించారు. గుర్తు తెలియని వ్యక్తులు ఫోన్ చేసి ఆధార్ నంబర్, బ్యాంకు ఖాతా నంబర్ అడిగితే చెప్పవద్దన్నారు. వివరాలు అడిగితే వెంటనే 1930 నంబరుకు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలన్నారు.

సదాశివనగర్(ఎల్లారెడ్డి): సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఏఎస్సై సాగర్ సూచించారు. ఆదివారం మండల కేంద్రంలో ప్రజలకు అవగాహన కల్పించారు. గుర్తుతెలియని వ్యక్తులు ఫోన్‌లు చేసి ఓటీపీలు చెప్పమంటే చెప్పవద్దన్నారు. అపరిచిత వ్యక్తులక నమ్మవద్దని సూచించారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి



పిట్లం(జుక్కల్): వాహనదారులు తప్పకుండా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ఎస్సై నీరేష్ పేర్కొన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని జాతీయ రహదారి సర్వీస్ రోడ్డుపై పెద్దకొడప్‌గల్ ఎస్సై కోనారెడ్డితో కలిసి ఆయన వాహనాల తనిఖీ నిర్వహించారు. నిబంధనలు పాటించని పలువురికి జరిమానాలు వేశారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే కేసులు పెడతామన్నారు.

ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): ఎల్లారెడ్డి పట్టణంలో పోలీసులు ఆదివారం వాహనాలను తనిఖీ చేశారు. నెంబర్‌ప్లేట్ లేకుండా వాహనాలను నడపవద్దని, హెల్మెట్ ధరించి వాహనాలను నడపాలని పోలీసులు వాహనదారులకు సూచించారు. వాహనదారులు తమ వెంట ఇన్సూరెన్స్, ఆర్‌సీ వెంట ఉంచుకోవాలని వారు తెలిపారు.

వీహెచ్‌పీ, బజరంగ్‌దళ్ గ్రామ కమిటీల ఏర్పాటు



రామారెడ్డి(ఎల్లారెడ్డి): రామారెడ్డి గ్రామ వీహెచ్‌పీ, బజరంగ్‌దళ్ కమిటీలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు జిల్లా వీహెచ్‌పీ అధ్యక్షుడు శ్రీనివాస్ ఆదివారం తెలిపారు. వీహెచ్‌పీ గ్రామ కమిటీ అధ్యక్షుడిగా సుధాకర్‌గౌడ్, ఉపాధ్యక్షుడిగా నారాయణ, ప్రధాన కార్యదర్శిగా మహేశ్, కోశాధికారిగా 7స్టార్‌రాజు, గ్రామ కమిటీ సంయోజక్‌గా అభినయ్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు వారు తెలిపారు.

ఆధ్యాత్మికం

మున్నూరుకాపు సంఘం ఆధ్వర్యంలో..



భిక్కనూరు: మండల కేంద్రంలో ఆషాఢ మాస బోనాల ఊరేగింపు కార్యక్రమాన్ని ఆదివారం ఘనంగా ప్రారంభిచారు. మున్నూరుకాపు సదర్ సంఘం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున బోనాల పండగను నిర్వహించారు. మహంకాళి, లక్ష్మమ్మ, మల్లన్నకు బోనాలను సమర్పించారు.

దేవాయిపల్లి, కృష్ణాజీవాడిలో..

తాడ్వాయి(ఎల్లారెడ్డి): దేవాయిపల్లి, కృష్ణాజీవాడి గ్రామాలలో ఆదివారం దేవతలకు గ్రామస్తులు ప్రత్యేక పూజలు చేశారు. గ్రామ దేవతలైన పెద్ద పోచమ్మ, నల్లపోచమ్మ, ముత్యాల పోచమ్మ, ఊరడమ్మ, పోతలింగయ్య, మైసమ్మ, ఎల్లమ్మ, నాయికమ్మ ఆలయాలకు వెళ్లి మొక్కులు తీర్చుకున్నారు.

భక్తి శ్రద్ధలతో పార్వతి పరమేశ్వర కల్యాణోత్సవం

కామారెడ్డి అర్బన్: కామారెడ్డి పట్టణం సరంపల్లి శివారులోని భూకన్‌పల్లి శ్రీవ్యాధి హరక అంజనేయ స్వామి ఆలయ ప్రాంగణంలో ఆదివారం వేద పండితులు గంగవరం అంజనేయ శర్మ ఆధ్వర్యంలో భక్తి శ్రద్ధలతో శ్రీపార్వతి పరమేశ్వర కల్యాణోత్సవం ఘనంగా నిర్వహించారు. ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అన్నదానం కార్యక్రమం చేపట్టారు. ఆలయ కమిటీ ప్రతినిధులు తడకమడ్ల హన్మాండ్లు, ఆకుల రవికుమార్, మాజీ సర్పంచులు నిట్టు గంగాధర్, ముల్కరాజు, ఎం.నాగయ్య, టి.అనిల్‌కుమార్, కౌన్సిలర్ ఆకుల రూప తదితరులు పాల్గొన్నారు.



నరసింహుడి ఆలయంలో భక్తుల సందడి



మాచారెడ్డి: చుక్కాపూర్ లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో ఆదివారం భక్తులు వేలాదిగా తరలివచ్చి సందడి చేశారు. మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన భక్తులతో పాటు కామారెడ్డి పరిసర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ కమలాకర్ రెడ్డి, ఈవో శ్రీధర్ రావు ఉన్నారు.

కుప్రియాల్‌లో పస్క జాతర

సదాశివనగర్(ఎల్లారెడ్డి): కుప్రియాల్‌లో ఆదివారం గ్రామస్తులు పస్క జాతర నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ దేవతలకు ప్రత్యేక పూజలు చేశారు. వర్షాలు సమృద్ధిగా కురువాలని కోరుకున్నారు.

సంక్షిప్తం

అయ్యప్పసేవా సమితి ప్రతినిధులకు సన్మానం

కామారెడ్డి అర్బన్: కామారెడ్డి అయ్యప్ప సేవా సమితి అధ్యక్ష, కార్యదర్శులు, కోశాధికారులుగా ఎన్నికైన గందె శ్రీనివాస్, గొనె శ్రీనివాస్, కార్యనిర్వాహక అధ్యక్షుడు పట్నం రమేష్‌లను ఆదివారం భూకన్‌పల్లి శ్రీవ్యాధిహారక హన్మాన్ దేవాలయ కమిటీ ఆధ్వర్యంలో సన్మానించారు. కార్యక్రమంలో సరంపల్లి మాజీ సర్పంచ్ నిట్టు గంగాధర్, ఆకుల రవికుమార్, ఎం.రాజు, మాజీ కౌన్సిలర్ నిట్టు వేణుగోపాల్‌రావు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి విషయంలో పార్టీలు చూడొద్దు

భిక్కనూరు: ఎన్నికల సమయంలోనే పార్టీలను చూడాలని, ఎన్నికల తర్వాత అభివృద్ధి విషయంలో పార్టీలను చూడవద్దని ఎంపీటీసీల ఫోరం మండల మాజీ కన్వీనర్ ద్యావర సాయిరెడ్డి అన్నారు. ఆదివారం ఆయనను ఎంపీటీసీగా పదవీ కాలం పూర్తి చేసిన సందర్భంగా తిప్పాపూర్‌లో నాగార్తి సంఘం ఆధ్వర్యంలో సన్మానించారు. సంఘం ప్రతినిధులు బాపురెడ్డి, నరేందర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో..

దోమకొండ: మండలకేంద్రంలోని పెద్దమ్మ ఆలయ ప్రాంగణంలో ముదిరాజ్ కుల సభ్యులు ఆలయ కమిటీ అధ్యక్షులు పున్న లక్ష్మణ్ ఆధ్వర్యంలో దోమకొండ గ్రామానికి సంబంధించి, ఇటీవల పదవీ విరమణ పొందిన జెడ్పీటీసీ తిరుమల గౌడ్, ఎంపీపీ కానుగంటి శారద నాగరాజు, ఎంపీటీసీ సభ్యులు శంకర్, కోట సదానంద, కడారి రమేష్, విజయ డైరీ మాజీ అధ్యక్షులు పున్న రాములు, వార్డ్ మెంబర్ అబ్రబోయినా సిద్ధ రాములు, కో-ఆప్షన్ మెంబర్ కొండ శ్రీనివాస్, అలాగే మత్స్యశాఖ మాజీ చైర్మన్ మలబోయిన రాజు, శివరాం మందిర్ ఆలయ అధ్యక్షుడు ఆబ్రబోయిన రాజేందర్ ,ఇటీవల ఉపాధ్యాయ వృత్తిలో ప్రమోషన్ పొందిన నాగారపు సత్యం, కామిండ్ల కృష్ణ, బోయిని రవి, ఆలయ, మత్స్య శాఖ మెంబర్లను సన్మానించారు.

వర్షం.. రైతుల్లో హర్షం



మద్నూర్‌లో పత్తి పంటలో కలుపుతీసేందుకు దున్నుతున్న రైతు

మద్నూర్(జుక్కల్): నిత్యం అడపాదడపా కురుస్తున్న వర్షంతో పంటలు కళకళలాడుతున్నాయి. ఆదివారం మండలంలోని పలు గ్రామాల్లో రైతులు వ్యవసాయ పనుల్లో బిజీగా మారారు. వేకువజామున నుంచే రైతులు అరకలను చేనుకు తీసుకెళ్లి కలుపు తీసే పనిలో పడ్డారు. మండలంలోని పత్తి, సోయాబీన్, పెసర, మినుము పంటల్లో కోడిపెలు కొడుతు గడ్డిని తీస్తున్నారు. రైతు కూలీలు గడ్డీని చెక్కెస్తు పనుల్లో నిమగ్నమయ్యారు.